క్లుప్తంగా

నేడు వైద్య శిబిరం

సీతానగరం: మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో డాక్టర్ వైఎస్సార్ కంటి వెలుగు పథకం ద్వారా అవ్వ తాతలకు శంకర్ ఫౌండేషన్ కంటి వైద్యుల ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్టు సీహెచ్‌ఓ ఎస్.వెంకటరమణ శనివారం తెలిపారు. ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకూ వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి శస్త్ర చికిత్సలకు ఎంపిక చేయనున్నట్టు పేర్కొన్నారు. కంటి రోగులు శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

దారునాయక్‌పై చర్యలు తీసుకోండి..



అంద్ర పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న గిరిజన ప్రజాప్రతినిధులు, ఎస్సీ, ఎస్టీ సెల్ నాయకులు

సాలూరు: ఉప ముఖ్యమంత్రి రాజన్నదొరపై నిరాధారణమైన అవినీతి ఆరోపణలు చేసిన టీడీపీ నాయకుడు దారునాయక్‌పై చర్యలు తీసుకోవాలని మెంటాడ మండల గిరిజన ప్రజాప్రతినిధులు, ఎస్సీ, ఎస్టీ నాయకులు భీమారావు, ప్రసాద్, రాంబాబు, అచ్చంనాయుడు, శంకరరావు, జనార్దన్, తదితరులు కోరారు. ఈ మేరకు మెంటాడ మండలం ఆంద్ర పోలీస్ స్టేషన్‌లో శనివారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, గిరిజన సంక్షేమ శాఖా మంత్రి పీడిక రాజన్నదొర అవినీతికి పాల్పడ్డారంటూ దారునాయక్ చేసిన వ్యాఖ్యలు సరికావన్నారు. నిజాయితీకి మారుపేరైన రాజన్నదొరకు వెంటనే దారునాయక్ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

అక్రమ నిర్మాణాలపై అధికారుల దృష్టి



అక్రమంగా నిర్మించిన భవనం వద్ద హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేసిన రెవెన్యూ అధికారులు

పాచిపెంట: మండల కేంద్రంలోని అక్రమ భవన నిర్మాణాలపై అధికారులు దృష్టి సారించారు. నిబంధనలకు విరుద్ధంగా వెలుస్తున్న భవనాలపై కొంతమంది ఇటీవల తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వ స్థలాల్లో నిర్మిస్తున్న భవనాలను గుర్తించి, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తున్నారు. అదే విధంగా నిర్మాణాలు పూర్తి చేసి వినియోగిస్తున్న భవన యజమానులకు నోటీసులు అందజేస్తున్నారు. ఈ విషయమై తహసీల్దార్ రాజశేఖర్ మాట్లాడుతూ, ప్రభుత్వ అనుమతులు లేకుండా భవన నిర్మాణాలు చేపడితే చర్యలు తప్పవన్నారు.

ప్రారంభానికి సచివాలయాలు సిద్ధం



పూర్తయిన పెదబోగిలి సచివాలయ భవనం

సీతానగరం: మండలంలో పలు గ్రామాల్లో నిర్మించిన సచివాలయ భవనాలు ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయని ఏఈ చంద్రమౌళి అన్నారు. మండలంలో పూర్తయిన పలు సచివాలయ భవనాలను ఆయన శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాతావరణం అనుకూలించడంతో సచివాయాలు, ఆర్‌బీకేలు, వెల్‌నెస్ భవన నిర్మాణ పనులు చురుగ్గా జరుగుతున్నాయని తెలిపారు. పెదంకలాం, పెదబోగిలి, వెంకటాపురం, నిడగల్లు, తామరఖండి, కాశీపేట సచివాలయాల భవనాలకు గుమ్మాలు, కిటికీ, పెయింటింగ్స్, విద్యుద్దీకరణ పనులు జరుగుతున్నాయన్నారు. ఆయన వెంట ఇంజినీరింగ్ సహాయకులు ఉన్నారు.

అర్హులకు అండగా సీఎం సహాయ నిధి



బాధితుడికి సీఎంఆర్ఎఫ్ చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే కళావతి

వీరఘట్టం/భామిని: ముఖ్యమంత్రి సహాయ నిధి అర్హులకు అండగా నిలుస్తోందని ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి అన్నారు. భామిని మండలం సతివాడ గ్రామానికి చెందిన దామోదర గణపతి క్యాన్సర్‌తో బాధపడుతుండడంతో వైద్యఖర్చుల నిమిత్తం సీఎం సహాయ నిధి నుంచి లక్ష రూపాయలను ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ మొత్తానికి సంబంధించిన చెక్‌ను ఎమ్మెల్యే కళావతి వండవలోని క్యాంపు కార్యాలయంలో శనివారం బాధితుడికి అందజేశారు. ఈ డబ్బుతో మెరుగైన చికిత్స చేయించుకోవాలని సూచించారు. పేదవాడికి కష్టం వస్తే ఆదుకునేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఎప్పుడూ ముందుంటారన్నారు.

గడప గడపకు.. ఆదరణ



మార్కొండపుట్టి గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా పర్యటిస్తున్న రాజన్నదొర, తదితరులు



లబ్ధిదారుకు బుక్‌లెట్ అందిస్తున్న డిప్యూటీసీఎం రాజన్నదొర

- మార్కొండపుట్టి పంచాయతీలో ఉప ముఖ్యమంత్రి పర్యటన
- సమస్యల పరిష్కారానికి రాజన్నదొర హామీ

మక్కువ: మండలంలోని మార్కొంపుట్టి పంచాయతీ పరిధిలో శనివారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి స్పందన లభించింది. మార్కొండపుట్టి, మర్రివానివలస, కె.పెద్దవలస గ్రామాల్లో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న రాజన్నదొర, తదితరులకు ప్రజలు ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రి ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలపై ఆరా తీశారు. నాలుగేళ్ల వైఎస్సార్‌సీపీ కాలంలో ఒక్కో కుటుంబానికి కలిగిన లబ్ధిని వివరిస్తూ ముఖ్యమంత్రి సందేశంతో కూడిన బుక్‌లెట్‌లను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. జగనన్న ఇళ్లు, పింఛన్లు, రైతుభరోసా, అమ్మఒడి, తదితర పథకాల పట్ల ప్రజలు సంతృప్తి వ్యక్తం చేశారు. పథకాలు అందని వారి వివరాలు తెలుసుకుని వారికి న్యాయం చేయాలని తహసీల్దార్ సూర్యనారాయణ, ఈఓపీఆర్డీ దేవకుమార్‌ను మంత్రి ఆదేశించారు. అనంతరం పలువురు ప్రజలు మాట్లాడుతూ, కొంతమంది అర్హులకు ఇళ్లు మంజూరు చేయడంతో పాటు సీసీ రోడ్లు వేయాలని కోరగా.. మంత్రి సానుకూలంగా స్పందించారు. ఒక్కో ఇంటికి నాలుగేళ్లలో రూ. 3 లక్షల నుంచి 6.50 లక్షల రూపాయల మేర లబ్ధి చేకూరిందని.. గతంలో ఏ ప్రభుత్వం ఇంతటి సంక్షేమం అందించలేదని మంత్రి చెప్పారు. సంక్షేమ పథకాలు కొనసాగాలంటే రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని మరోసారి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ మెల్లిక రాములమ్మ, ఎంపీపీ మర్రి పారమ్మ, జెడ్పీటీసీ సభ్యుడు మావుడి శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు మావుడి రంగునాయుడు, ఎంపీటీసీ సభ్యురాలు మండంగి భాగ్యలక్ష్మి, మాజీ సర్పంచ్‌లు తేలు శ్రీరాములునాయుడు, తేలు జ్యోతి, వైఎస్సార్‌సీపీ నాయకులు బొత్స అప్పలనాయుడు, పెంట సంజీవునాయుడు, బొంగు భీమలింగేశ్వరరావు, రౌతు లక్ష్మంనాయుడు, కోట్ల నారాయణరావు పాల్గొన్నారు.



డిప్యూటీసీఎం రాజన్నదొరను, మావుడి సోదరులను సత్కరించిన అభిమానులు

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



వార్డులో సమస్యలు అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే జోగారావు

- ఎమ్మెల్యే జోగారావు

పార్వతీపురం టౌన్: సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. పురపాలక సంఘం పరిధిలోని నాలుగవ వార్డు, తూర్పు వీధి కాలనీలో స్థానిక ప్రజా ప్రతినిధులు, నాయకులు, మున్సిపల్ అధికారులతో కలిసి శనివారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలను కలుసుకుని వార్డులో మంచినీరు బాగా వస్తుందా, కాలువలు శుభ్రంగా ఉన్నాయా, ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలన్నీ అందరికీ సకాలంలో అందుతున్నాయా, ఇవి కాకుండా ఇంకా వార్డులో ఏమైనా సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. వార్డులో అపరిశుభ్రంగా ఉన్నచోట శుభ్రం చేయాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డికి మద్దతు తెలిపి 2024 సాధారణ ఎన్నికల్లో ఆయనను ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బోను గౌరీశ్వరి, పార్టీ పట్టణ అధ్యక్షుడు కొండపల్లి బాలకృష్ణ, వివిధ వార్డుల కౌన్సిలర్లు కోరాడ శ్రీనివాసరావు, ఎస్.లావణ్య, నిమ్మకాయల సుధీర్, వి.నేతాజీ, పి.జయంతి జి.గాయత్రి, జేసీఎస్ కన్వీనర్ గొర్లి మాధవరావు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు రెడ్డి రవికుమార్, పాలవలస శ్రీనివాసరావు, సిరిపురపు ప్రకాష్, చిట్టి, ఎం.తబిటినాయుడు, ఆకుల శ్రీనివాసరావు, జిల్లా ఎస్ఎస్ఎల్ అధ్యక్షుడు ఎస్.శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, సచివాలయం ఉద్యోగులు, మున్సిపల్ సిబ్బంది, వలంటీర్లు స్థానికులు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యం



రహదారి నిర్మాణ పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జోగారావు

పార్వతీపురం టౌన్: పురపాలక సంఘం పరిధిలో మౌలిక సదుపాయాలు కల్పనలో భాగంగా అభివృద్ధి పనులు చేపడుతున్నామని ఎమ్మెల్యే జోగారావు అన్నారు. శనివారం 7వ వార్డు నందమూరి కాలనీ మొదటి వీధిలో సీసీ రోడ్డు, కాలువ నిర్మాణానికి శంకుస్థాపన చేసి నిర్మాణ పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో వార్డు ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం గడప గడపకు నిధుల నుంచి రోడ్డు, కాలువ నిర్మాణం చేపట్టడం జరుగుతుందన్నారు. మీరందరూ ప్రభుత్వానికి మద్దతుగా నిలిచి సీఎం సీఎం జగన్‌మోహన్ రెడ్డికి మళ్లీ ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాలని కోరారు. అనంతరం 8వ వార్డు పెద్దవీధిలో నిర్మాణం జరుపుకుంటున్న సీసీ రోడ్డు పనులను అధికారులు, ప్రజా ప్రతినిధులతో కలిసి పరిశీలించి రోడ్డు నిర్మాణం నాణ్యత ప్రమాణాలతో త్వరగా పూర్తి చేసి ప్రజలకు అసౌకర్యం కలగకుండా అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు.

వార్డు ప్రజలు ఎమ్మెల్యే జోగారావు, సీఎం వైఎస్ జగన్‌కి కృతజ్ఞతలు తెలిపారు. మున్సిపల్ చైర్‌పర్సన్ బోను గౌరీశ్వరి, పార్టీ పట్టణ అధ్యక్షుడు కొండపల్లి బాలకృష్ణ, మున్సిపల్ కమిషనర్ రామప్పల నాయుడు, వార్డు కౌన్సిలర్లు బొత్స ఆనంద్, పి.జయంతి, జి.గాయత్రి, ఎస్.లావణ్య, వి.నేతాజీ, ఎస్.సుధీర్ కుమార్, కో ఆప్షన్ సభ్యులు మేరువ వెంకట్రావు, ఎస్.సదానందం, వైఎస్సార్‌సీపీ నాయకులు, గృహ సారథులు, కార్యకర్తలు, స్థానికులు పాల్గొన్నారు.

చెల్లన్నాయుడువలసలో ఆర్డీఓ

సీతానగరం: మండలంలోని చెల్లన్నాయుడువలసలో సైబీరియా(విదేశీ విహంగాలు) పక్షులున్న ప్రాంతాన్ని శనివారం సాయంత్రం ఆర్డీఓ కె.హేమలత సదర్శించారు. విదేశీ పక్షుల సందడి ఇటీవల ఎక్కువగా కనిపిస్తుండడంతో సందర్శకులు ఇక్కడకు ఎక్కువగానే వస్తుంటారు. ఈ క్రమంలోనే ఆర్డీఓ హేమలత తన కుటుంబ సభ్యులతో వచ్చి సైబీరియా పక్షులను చూశారు. ఆమె వెంట తహసీల్దార్ ఎన్వీ రమణ, ఆర్ఐ ఎస్.శ్రీనివాసరావు, వీఆర్ఓలు, గ్రామ పెద్దలు ఉన్నారు.

గర్భిణుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

- డీఐఓ జగన్మోహనరావు



సిబ్బందికి సూచనలు చేస్తున్న డీఐఓ జగన్మోహనరావు

గరుగుబిల్లి: ప్రసవ సమయం దగ్గర పడుతున్న గర్భిణుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి(డీఐఓ) డాక్టర్ టి.జగన్మోహనరావు సూచించారు. గరుగుబిల్లి పీహెచ్‌సీలో పీఎంఎస్ఎంఏ కార్యక్రమం అమలుతీరును శనివారం ఆయన తనిఖీ చేశారు. గర్భిణులకు అందిస్తున్న వైద్య సేవలను, రక్తపరీక్షలను పరిశీలించారు. హైరిస్క్ గర్భిణులు, ప్రత్యేక బ్లడ్‌గ్రూప్ కలిగినవారు, కాన్పు సమయం దగ్గరగా ఉన్నవారి వివరాలను అడిగి తెలుసుకున్నారు. వైద్య పరీక్షల కోసం వచ్చిన గర్భిణులతో మాట్లాడి వారికి అందుతున్న సేవలపై ఆరాతీశారు. వారి వద్ద ఉన్న మాతాశిశు సంరక్షణ కార్డులను పరిశీలించి, వైద్య సిబ్బందికి తగు సూచనలు చేశారు. సాధారణ ప్రసవాలన్నీ పీహెచ్‌సీలో జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. హెచ్ఐవీ, సిఫిలిస్, టీబీ, షుగరు నిర్ధారణ పరీక్షలు కచ్చితంగా చేయాలని సూచించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గర్భస్థ పిండం ఎదుగుదల తీరు, లోపాలను గుర్తించేందుకు జరిపే టిఫ్ఫా స్కానింగ్ ఇప్పుడు ఆరోగ్యశ్రీ అనుబంధ ఆస్పత్రుల్లో ప్రభుత్వం ఉచితంగా అందిస్తోందన్నారు. హైరిస్క్ గర్భిణులను ఆస్పత్రికి చేర్చేందుకు తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనాలు అందుబాటులో ఉన్నాయన్నారు. అదేవిధంగా ప్రభుత్వం పీఎంఎంవీవై, జేఎస్‌వై, ఆరోగ్య ఆసరా తదితర సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆయన వెంట వైద్యాధికారి డాక్టర్ ప్రియాంక, సూపర్‌వైజర్లు చిన్నమ్మి, ఉదయకుమారి, ప్రసాద్, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు ఉన్నారు.

ప్రకృతి వ్యవసాయం ప్రతీ పల్లెకు విస్తరించాలి

- ఎక్స్ అఫీషియో ప్రత్యేక కార్యదర్శి విజయ్‌కుమార్



మాట్లాడుతున్న విజయ్‌కుమార్

గరుగుబిల్లి: ప్రకృతి వ్యవసాయం ప్రతీ పల్లెకు విస్తరించాలని ఎక్స్ అఫీషియో ప్రత్యేక కార్యదర్శి టి.విజయ్‌కుమార్ అన్నారు. ట్రస్ట్ ఏర్పాటు చేసి 25 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా తోటపల్లి జట్టు ట్రస్ట్ నూతన భవన ప్రాంగణంలో ట్రస్ట్ వ్యవస్థాపకుడు డి.పారినాయుడు అధ్యక్షతన శనివారం రజతోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా రిటైర్డ్ ప్రిన్సిపల్ సెక్రటరీ టి.దమయంతి సహకారంతో నిర్మించిన కార్యాలయ భవనంను, అన్నపూర్ణేశ్వరీ సమేవేశ మందిరం, జట్టు గ్రంథాలయం గోడౌన్‌ను, సహజ ఎరువుల ఉత్పత్తి కేంద్రాన్ని విజయ్‌కుమార్ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించేందుకు జట్టు సంస్థ చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. జట్టు సంస్థ రూపొందించిన 'నేల తల్లికి వందనం.. మడిచేల తల్లికి వందనం' గీతాన్ని ప్రకృతి వ్యవసాయ ప్రార్థనా గీతంగా రాష్ట్రమంతా ఆచరించడం జరుగుతుందన్నారు. ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడులను సాధించడంతో పాటు ఆరోగ్యకర ఉత్పత్తులను పొందేందుకు అవకాశం ఉంటుందన్నారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతీ ఒక్కరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో నాబార్డు డీడీఎం టి.నాగార్జున, మేనేజింగ్ ట్రస్టీ ఎం.ప్రసాద్‌రావు, మాజీ చీఫ్ కమిషనర్ ఆఫ్ ఇన్‌కం ట్యాక్స్ తిరుమలరావు, డీపీఎం షణ్ముఖరాజు తదితరులున్నారు.

బస్ సర్వీసులు పెంచాలని వినతి



ఎమ్మెల్యే పుష్పశ్రీవాణికి వినతిపత్రం అందజేస్తున్న గెద్దతిరువాడ, కుందరతిరువాడ గ్రామస్తులు

జియ్యమ్మవలస: మండలంలోని పెదకుదమ, చినకుదమ, కుందరతిరువాడ, నీచుకవలస, గ్రామాలకు బస్ సర్వీసులు పెంచాలని కోరుతూ ఆయా గ్రామస్తులు ఎమ్మెల్యే పుష్పశ్రీవాణికి శనివారం వినతిపత్రం అందజేశారు. పెదకుదమ మీదుగా గెద్దతిరువాడ వరకు రోజుకు 5 ట్రిప్పులు బస్సు సర్వీసు నడిచేదని, ప్రస్తుతం రెండు సార్లు మాత్రమే తిరుగుతోందని అన్నారు. గతంలో ఉదయం 5.30 నుంచి రాత్రి నైట్‌హాల్ట్ సర్వీసు వరకు ఐదుసార్లు నడవగా.. ప్రస్తుతం ఉదయం 8 గంటలకు, సాయంత్రం 6 గంటలకు మాత్రమే బస్సు వస్తోందని, దీంతో రాకపోకలకు ఇబ్బందులు పడాల్సి వస్తోందని వాపోయారు. గతంలో మాదిరిగా ఐదు ట్రిప్పులు నడిపేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఎమ్మెల్యే స్పందిస్తూ.. డిపోమేనేజర్‌తో మాట్లాడి సమస్య పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. వినతి ఇచ్చిన వారిలో బి.శ్రీనివాసరావు, సీహెచ్ రాంబాబు, ఎస్.సింహాచలం తదితరులు ఉన్నారు.

పంట పొలాల్లో పక్షి స్థావరాలు అవసరం



పలగరలో పొలంబడి కార్యక్రమంలో పాల్గొన్న ఏఓ శ్రావణ్, సిబ్బంది

బలిజిపేట: పంట పొలాల్లో పక్షి స్థావరాలు ఎంతో అవసరమని ఏఓ శ్రావణ్ తెలిపారు. పలగరలో వైఎస్సార్ పొలంబడి కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. పక్షి స్థావరాలను ఏర్పాటు చేయడం వలన వాటిపై పక్షులు చేరి శత్రు పురుగులను, వాటి లార్వాలని తింటాయని తెలిపారు. ఇలా తినడం వలన శత్రుపురుగుల ఉధృతి తగ్గుతుందని తెలిపారు. పక్షి స్థావరాలను టీ ఆకారంలో కాని, పక్షులు నిలబడే విధంగా చేసుకోవాలని సూచించారు. ఇవి పైరుకన్నా ఒక అడుగు ఎత్తు ఉండేలా చేయాలన్నారు. రసాయనిక పురుగు మందులను పిచికారీ చేయడం వలన దుష్ఫలితాలు సోకుతాయని మండల వ్యవసాయ శాఖ అధికారి శ్రావణ్ తెలిపారు. రైతులు తగు సూచనలు వ్యవసాయ శాఖ ద్వారా పొంది పంటను పండిస్తే మంచి దిగుబడులు వస్తాయన్నారు. మండలంలో పెదపెంకి, నారాయణపురం, బర్లి, తుమరాడ, చిలకలపల్లి, పలగర రైతుభరోసా కేంద్రాలలో పొటాష్ నిల్వ ఉందని అక్కడ ఉన్న వ్యవసాయ సహాయకులను సంప్రదించి పొందవచ్చని తెలిపారు. పంట చిరుపొట్ట దశలో ఉన్నందున పొటాష్ అవసరమన్నారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు డి.మాధవి, వలంటీర్లు, రైతులు పాల్గొన్నారు.

ఇంటింటి కుళాయి నిర్మాణ పనుల పరిశీలన



లచ్చయ్యపేటలో జరుగుతున్న ఇంటింటి కుళాయి నిర్మాణ పనులు

సీతానగరం: లచ్చయ్యపేట ప్రజలకు ఇంటింటి కుళాయిల ద్వారా తాగునీరు పంపిణీ చేసేందుకు అవసరమైన నిధులు ప్రభుత్వం మంజూరు చేసినందున నిర్దేశించిన గడువులోగా పనులు పూర్తి చేయాలని జెడ్పీటీసీ సభ్యుడు ఎం.బాబ్జీ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఆర్.పవన్‌కుమార్ అనఆనరు. సర్పంచ్ సీహెచ్ కృష్ణ, జెడ్పీటీసీ బాబ్జీ గ్రామంలో ఇంటింటి కుళాయి పనులను శనివారం పరిశీలించారు. ఏఈ పవన్‌కుమార్ మాట్లాడుతూ లచ్చయ్యపేట గ్రామానికి జెడ్పీ నుంచి వచ్చిన నిధులు రూ.9.9 లక్షల వ్యయంతో వాటర్ ట్యాంకు నిర్మాణ పనులు పూర్తయినట్టు తెలిపారు. గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం నిధులు రూ.3లక్షలు, జేజేఎం నిధులు రూ.11 లక్షల వ్యయంతో పైపులైన్లు, ఇంటింటికి కుళాయి నిర్మాణ పనులు నిర్దేశించిన గడువులోగా పూర్తి చేయాలని కోరారు. గాదెలవలసలో ఇంటింటి కుళాయి పనులు వేగవంతం చేయాలని కోరారు.

ఉత్సాహంగా... జిల్లా స్థాయి మారథాన్



మారథాన్‌ను జెండా ఊపి ప్రారంభిస్తున్న జిల్లా క్రీడల చీఫ్ కోచ్ వెంకటేశ్వరరావు

పార్వతీపురం టౌన్: యువతలో హెచ్ఐవీ ఎయిడ్స్‌పై అవగాహన కల్పించేందుకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ యూత్ ఫెస్ట్ ఆధ్వర్యంలో శనివారం అవగాహన ర్యాలీ, జిల్లా స్థాయి మారథాన్ నిర్వహించారు. జూనియర్ కళాశాల మైదానం నుంచి ప్రారంభమైన ర్యాలీని జిల్లా క్రీడల చీఫ్ కోచ్ ఎస్.వెంకటేశ్వరరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెచ్ఐవీ వైరస్ నిర్మూలనకు ప్రభుత్వం తన వంతు పటిష్టమైన చర్యలు చేపట్టిందన్నారు. దీని నిర్మూలనకు ప్రజలంతా క్రమశిక్షణయుతమైన జీవితాన్ని గడపాలని సూచించారు. భారత ప్రభుత్వం ఎయిడ్స్ నియంత్రణ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన ర్యాలీలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ప్రాజెక్టు మేనేజర్ పి.బాలాజీ, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ టి.జగన్‌మోహన్‌రావు, ప్రోగ్రాం అధికారి డాక్టర్ వినోద్, డీపీఎస్ గుప్త, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రాజీకి లోక్ అదాలత్ చక్కని వేదిక

- సీనియర్ సివిల్ జడ్జి యజ్ఞనారాయణ
- రెండవ అదనపు జిల్లా జడ్జి కోర్టు ఆవరణలో జాతీయ లోక్ అదాలత్
- 1,918 కేసుల పరిష్కారం



సమావేశంలో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి యజ్ఞనారాయణ

పార్వతీపురం టౌన్: తగాదాలు వద్దని రాజీయే శ్రేయస్కరమని అప్పీల్ లేని అంతిమ తీర్పుకే ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా సీనియర్ సివిల్ జడ్జి యజ్ఞనారాయణ అన్నారు. స్థానిక జిల్లా కోర్టు ప్రాంగణంలో జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్న చిన్న సమస్యలను సత్వరమే పరిష్కరించుకోవాలని కక్షిదారులకు సూచించారు. ఎటువంటి సమస్యతో కోర్టుకు వెళ్లరాదన్నారు. కుటుంబ సమస్యలు, వివాహ, ఆస్తి తగాదాలు వంటి సమస్యలను పెద్దవారితో చర్చించుకొని రాజీ చేసుకోవాలని కోరారు. ఎక్కువగా వివాహ తగాదాలు కోర్టుకు వస్తున్నాయన్నారు. వివాహ వ్యవస్థ అనేది చాలా బలమైనదని భార్య, భర్తలు అన్యోన్యంగా ఉండి చిన్న చిన్న సమస్యలను ఇరువురు కలసి చర్చించుకొని సమస్యను పరిష్కరించుకోవాలని హితవు పలికారు. పరిష్కారం కాని సమస్యలు ఉంటేనే కోర్టుకు రావాలన్నారు.

1,918 కేసుల పరిష్కారం

జిల్లా కోర్టు ప్రాంగణంలో మొత్తం 1,918 కేసులు పరిష్కరించామన్నారు. అందులో 14 సివిల్ కేసులు, 1,855 క్రిమినల్ కేసులు, 13 మోటార్ వెహికల్ కేసులు, 33 బీఎస్ఎన్ఎల్, లిటిగేషన్ కేసులు, మూడు ఎక్సైజ్ కేసులను పరిష్కారించామన్నారు. సివిల్ కేసులకు సంబంధించి రూ.5,58,713 వసూళ్లు చేసి కక్షిదారులకు అందించామన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎ.రమేష్, మెజిస్ట్రేట్ డి.సౌజన్య, న్యాయవాదులు, కక్షిదారులు తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా పూడికతీత పనులు

పార్వతీపురం టౌన్: పట్టణంలోని వరహాలగెడ్డ పూడిక తీత పనులను యుద్ధ ప్రాతిపదికన చేపడుతున్నట్లు ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. పట్టణంలో నిర్వహిస్తున్న పూడిక తీత పనులను ఆయన శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల కురిసిన భారీ వర్షానికి వరహాలగెడ్డ కుడి, ఎడమ పాయలలో వరద ఉధృతికి భారీ స్థాయిలో చెత్త, వ్యర్థాలు పేరుకుపోయిన కారణంగా వరదనీరు జనావాసాల్లోకి ప్రవేశించిందన్నారు. ప్రజలకు తీవ్ర ఇబ్బందులకు గురిచేసిన విషయం అందరికీ తెలిసిందేనన్నారు. రానున్న రోజుల్లో ఇటువంటి పరిస్థితి కలగకుండా ఉండేందుకు అధికారులతో కలసి గెడ్డలో వున్న చెత్త, వ్యర్థపదార్థాలు, గుర్రపు డెక్క తొలగించేందుకు చర్యలు చేపట్టామన్నారు.

జేసీబీ యంత్రాల సహాయంతో 19, 20 వార్డుల పరిసర ప్రాంతాల్లో ఉన్న గెడ్డ వీధి మీదుగా పూడిక తీసివేస్తున్నామన్నారు. నీటి ప్రవాహానికి ఎటువంటి ఆటంకం కలగకుండా భవిష్యత్‌లో ముంపునకు గురవ్వకుండా చర్యలు చేపట్టామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రామప్పలనాయుడు, పట్టణ అధ్యక్షుడు కొండపల్లి బాలకృష్ణ, వైఎస్సార్‌సీపీ నాయకులు, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.